## ఇక బడుగు వ్యాపారుల పైనా జీఎస్టీ!

న్యూఢిల్లీ, మే 24: మధ్య స్థాయి నుంచి భారీ స్థాయిలో వ్యాపారం చేసే వారిని లక్ష్యంగా చేసుకుని ఎడాపెడా జీఎస్టీ భారాన్ని విధించిన కేంద్రం ఇప్పుడు బడుగు, బలహీన వర్గాలను కూడా పన్ను పరిధిలోకి తేవాలని తహతహలాడుతున్నది. అనధికారిక ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించి వారిని కూడా జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) తన ఫీల్డ్ అధికారుల ద్వారా ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు కసరత్తులు ప్రారంభించింది. నమోదు కాని సంస్థల ద్వారా పన్ను ఎగవేతలను నిరోధించి నగదు ఆధారిత, లెక్కల్లో చూపని లావాదేవీలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ధ్యేయంగా నిర్ణయించుకుంది. ఇదే కనుక అమలైతే ఇక నుంచి బజ్జీల బండి వాళ్లు, బండ్లపై అరటి పండ్లు అమ్ముకునే వారితో పాటు రోడ్డు పక్కన ఉండే మెకానిక్‌లు, సైకిల్ షాపు వాళ్లు, టైర్లకు గాలి కొట్టేవారు.. ఇలా ఒకరేమిటి రోడ్డుపక్కన తోటకూర అమ్ముకునే తాత నుంచి, రేగు పండ్లు అమ్ముకునే మామ్మ వరకు అందరిపై జీఎస్టీని ఎడాపెడా విధించడానికి కేంద్రం చకచకా పావులు కదుపుతున్నది.

## డీ-మెర్జింగ్‌తో వాటాదారులకు లాభమే

టాటా మోటర్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



న్యూఢిల్లీ, మే 24: టాటా మోటర్స్‌ను విడగొట్టే ప్రతిపాదనతో దీర్ఘకాలికంగా వాటాదారులకు లాభం చేకూరనున్నదని కంపెనీ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. కంపెనీ 80వ వాటాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టాటా మోటర్స్‌ను రెండు సంస్థలుగా విడగొట్టి కమర్షియల్ వాహనాలు, ప్యాసింజర్ వాహన విభాగాలుగా విడగొట్టి స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే వాటాదారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఈ ఏడాది రెండో అర్ధ భాగం నాటికి టాటా మోటర్స్ రెండు సంస్థలుగా మారబోతున్నది. వ్యాపార వ్యూహాత్మకంలో భాగంగా పలు సంస్థలను విడగొట్టాలని నిర్ణయించినట్టు, దీంతో గ్రూపు ఆర్థికంగా బలోపేతం కావడంతోపాటు వాటాదారులకు లబ్ధిచేకూరనున్నదని ఆయన వ్యాఖ్యానించారు.




# గిన్నిస్‌బుక్‌లో ఎల్ఐసీ

### 24 గంటల్లో 5.88 లక్షల పాలసీల విక్రయంతో రికార్డు

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మరో అరుదైన ఘనతను సాధించింది. కేవలం 24 గంటల్లో రికార్డు స్థాయిలో బీమా పాలసీలను విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నది. ఈ ఏడాది జనవరి 20న ఈ అరుదైన ఘనతను సాధించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. విస్తృతమైన ఏజెన్సీ నెట్‌వర్క్ కలిగిన తమ పనితీరుకు గుర్తుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు గుర్తించిందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 20న కంపెనీకి చెందిన 4,52,839 ఏజెంట్లు ఒక్కో పాలసీ చొప్పున 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించారు. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలను విక్రయించడం ఇదే తొలిసారని తెలిపింది. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం రోజైన జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే'ను పురస్కరించుకొని ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్కో పాలసీ అయిన పూర్తి చేయాలన్న కంపెనీ ఎండీ, సీఈవో సిద్దార్థ మొహంతీ విజ్ఞప్తి మేరకు ఈ అరుదైన ఫీట్‌ను సాధించినట్లు వెల్లడించారు. ఈ అరుదైన మైలురాయిని సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు.




# సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు

### ఈవీను విడుదల చేసిన చైనా సంస్థ షియోమీ

న్యూఢిల్లీ, మే 24: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ షియోమీ మరో అడుగుముందుకేసింది. ఇప్పటికే తన తొలి మాడల్‌కు విశేష స్పందన లభిస్తున్న ప్రస్తుత తరుణంలో మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వైయూ7 పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో గరిష్ఠంగా 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. టెస్లాకు చెందిన వై మాడల్‌కు పోటీగా ఈ కారును ప్రవేశపెట్టింది. ఇప్పటికే విడుదల చేసిన ఎస్‌యూ7 సెడాన్ 2.58 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి.

**ఈ నూతన కారు ప్రత్యేకతలు..**

- సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అత్యధిక మైలేజీ ఇచ్చే మూడో మాడల్ ఇదే కావడం విశేషం.
- 96.3 కిలోవాట్ల ఎల్ఎఫ్‌పీ బ్యాటరీతో తీర్చిదిద్దింది. కేవలం 3.23 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 253 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- ప్రో మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 770 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

# ఎఫ్‌డీఐలు తిరోగమనం

### 2024-25లో భారీగా తగ్గిన విదేశీ పెట్టుబడులు



న్యూఢిల్లీ, మే 24: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో నరేంద్ర మోదీ సర్కార్ విఫలమవుతున్నది. గడిచిన కొన్నేండ్లుగా తగ్గుముఖం పట్టిన ఎఫ్‌డీఐలు..గడిచిన ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా పడిపోయాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి కేవలం 353 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది వచ్చిన 10 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలతో పోలిస్తే 96.5 శాతం తగ్గాయని పేర్కొంది. అంతక్రితం ఏడాది రికార్డు స్థాయి ఎఫ్‌డీఐలను ఆకర్శించిన భారత్.. ఆ మరుసటి ఏడాదే భారీగా పడిపోవడం విశేషం. కానీ, విదేశాల్లో పెట్టుబడులు పెట్టే దేశీయ కంపెనీలు భారీగా పెరుగుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆయా సంస్థలు 29 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాయి. అంతక్రితం ఏడాది పెట్టిన 17 బిలియన్ డాలర్ల కంటే ఇది 50 శాతానికి పైగా అధికం.

**విదేశీ పెట్టుబడిదారులు దూరం**

ప్రపంచ దేశాల్లో భారత్ అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నప్పటికీ విదేశీ పెట్టుబడిదారులు పెద్దగా ఆసక్తిని కనబర్చడం లేదు. దీంతో గడిచిన కొన్నేండ్లుగా భారీగా పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు..గతేడాది పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేశారు. కానీ, దేశీయ ఈక్విటీ మార్కెట్లపై మాత్రం ఎనలేని ప్రేమను కురిపిస్తున్నారు. ఇతర దేశాల ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే సెన్సెక్స్, నిఫ్టీలు రెండంకెల స్థాయిలో రాబడిని పంచడమే ఇందుకు కారణం. మొత్తంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు 13.7 శాతం పెరిగి 81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటిలో సగం ఐపీవోకి వచ్చిన సంస్థల్లో ఇన్వెస్ట్ చేశారు. 2023-24 సంవత్సరంలో విదేశీ పెట్టుబడిదారులు 49 బిలియన్ డాలర్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ఆల్ఫా వేవ్ గ్లోబల్ అండ్ పార్టనర్స్ గ్రూపు, స్విగ్గీ, విశాల్ మెగా మార్ట్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐలు అత్యధికంగా వచ్చాయి. అలాగే అల్టార్‌నెటివ్ క్యాపిటల్ అసోసియేషన్(ఐవీసీఏ), ఈవై, పీఈ/వీసీ ల నుంచి 26.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. హ్యుందాయ్ మోటర్ ఇండియా తన వాటాను 100 శాతం నుంచి 82.5 శాతానికి తగ్గించుకోవడంతో రూ.27,870 కోట్ల నిధులు సమకూరగా, అలాగే స్విగ్గీ కూడా 2 బిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. వీటితోపాటు టెలికం దిగ్గజం సింగ్‌టెల్..భారతీ ఎయిర్‌టెల్‌లో తనకున్న వాటాను మొత్తం విక్రయించగా, అలాగే బ్రిటిష్ అమెరికన్ టొబాకో(బీఏటీ)..ఐటీసీలో ఉన్న తన మొత్తం వాటాను విక్రయించింది. గతేడాది సెప్టెంబర్ నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో ఒక్కో విదేశీ కంపెనీలు..దేశీయ పెట్టుబడులను ఉపసంహరించుకున్నాయి.

**తయారీ రంగానికి బ్రేకులు**

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో తయారీ రంగంతోపాటు ఆర్థిక సేవలు, ఎనర్జీ, కమ్యూనికేషన్ రంగాలు విఫలమయ్యాయి. గత కొన్నేండ్లుగా ఈ రంగాలు ఆశాజనక పనితీరు కనబర్చలేకపోవడంతో విదేశీ పెట్టుబడిదారులు వీటివైపు కన్నెత్తి కూడా చూడలేదు. తయారీ, ఆర్థిక సేవలు, ఎనర్జీ, టెలికం రంగాల్లోకి ఎఫ్‌డీఐలు భారీగా తగ్గడం మొత్తం ఎఫ్‌డీఐలపై ప్రతికూల ప్రభావం చూపాయని సెంట్రల్ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడించింది.

## హైదరాబాద్‌లో యంత్రాల ఎగ్జిబిషన్

హైదరాబాద్, మే 24: దక్షిణాదిలో అతిపెద్ద బీ2బీ ఇండస్ట్రీయల్ యంత్రాలు అండ్ ఇంజినీరింగ్ ఎగ్జిబిషన్‌కు మరోసారి హైదరాబాద్ వేదికైంది. నాలుగోసారి జరుగుతున్న ఈ ఎగ్జిబిషన్‌లో ఇంజినీరింగ్, మౌలిక రంగానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మెషిన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

**బ్రోక్‌ఫిల్డ్ భారీ పెట్టుబడులు**

న్యూఢిల్లీ, మే 24: అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ బ్రోక్‌ఫిల్డ్..భారత్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. వచ్చే ఐదేండ్లకాలంలో తన ఆస్తులను 100 బిలియన్ డాలర్ల స్థాయిలో పెంచుకోవడానికి భారీగా ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నది. ప్రస్తుతం సంస్థ భారత్‌లో 30 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులు కలిగివున్నది. మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, రెన్యూవబుల్ ఎనర్జీ, ప్రైవేట్ ఈక్విటీల్లో తన అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ కలిగివున్నది.

# ఎఫ్ఐఐల 5 వేల కోట్లు వెనక్కి

### గతవారంలో తరలించుకుపోయిన విదేశీ ఇన్వెస్టర్లు

న్యూఢిల్లీ, మే 24: దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకుంటున్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత వారంలోనూ రూ.5 వేల కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనుకావడంతో ఈ నెల 19 నుంచి 23 మధ్యకాలంలో ఈక్విటీల నుంచి రూ.4,784.32 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎఫ్ఐఐల పెట్టుబడులు రూ.18,620 కోట్ల నుంచి రూ.13,835 కోట్లకు తగ్గాయని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఐదు సెషన్లలో విదేశీ పెట్టుబడిదారులు అత్యధికంగా తమ పెట్టుబడులను తరలించుకుపోయారు. తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు గతవారంలో ఒకరోజు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి ఎఫ్ఐఐలు రూ.98,516 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..యూరోపియన్ దేశాలపై ప్రతీకార సుంకాలను 50 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయంగా పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించారు. దేశీయ ఆర్థిక మూలాలపై ఎలాంటి ప్రభావం లేదని, కేవలం అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల వల్లనే ఎఫ్ఐఐలు వెనక్కి తీసుకుంటున్నారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ నెలలో ఎఫ్ఐఐలు రూ.4,223 కోట్ల పెట్టుబడులు పెట్టగా, మార్చి నెలలో రూ.3,973 కోట్ల విలువైన స్టాక్స్‌ను కొనుగోలు చేశారు. కానీ, జనవరి నెలలో రూ.78 వేల కోట్లు, ఫిబ్రవరి నెలలో రూ.34,574 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.



## ఎన్టీపీసీ రూ.33.50 డివిడెండ్

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.7,897.14 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,490.05 కోట్ల లాభంతో పోలిస్తే భారీగా వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.48,816.55 కోట్ల నుంచి రూ.51,085 కోట్లకు ఎగబాకింది. దీంట్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా సంస్థకు రూ.49,352 కోట్ల ఆదాయం సమకూరింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,90,862.45 కోట్ల ఆదాయంపై రూ.23,953.15 కోట్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు, 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.33.50 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. గతేడాది కొత్తగా 3,972మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రావడంతో మొత్తం కెపాసిటీ 79,930 మెగావాట్లకు చేరుకున్నది.

# నిలిచిపోయిన తునికాకు సేకరణ



తడిచిన కల్లాలను పరిశీలిస్తున్న అధికారులు

చర్ల, మే 24: చర్ల అటవీ పరిధిలో తునికాకు సేకరణ నిలిచిపోయింది. తునికాకు సేకరణ మొదలు పెట్టిన నాటి నుంచి ప్రతిరోజూ వర్షాలు పడుతున్నాయి. దీంతో కళ్ళాలో ఆరబెట్టిన తునికాకు తడిచి పనికిరాకుండా పోతుందని కారణంతో ఆకు సేకరణ నిలిపివేసినట్టు తెలిసింది. తునికాకు సేకరించేందుకు అధికార యంత్రాంగం, గుత్తేదారులు తమవంతుగా కృషి చేసినప్పటికీ వర్షాలు ఆకు సేకరణకు అడ్డంకిగా మారాయి. ఈ యేడాది తునికాకు సేకరణ టార్గెట్‌ను చేరుకోలేకపోయామని, 50 శాతం మాత్రమే సేకరణ జరిగిందని రేంజర్ ద్వాలియా తెలిపారు. తునికాకు సేకరణ నిలిపివేశామని ఆయన పేర్కొన్నారు.

# ఇంకుడు గుంతలతో జల రక్షణ



ఇంకుడు గుంత పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

అశ్వారావుపేట రూరల్, మే 24: భూగర్భ జలాలను రక్షించేందుకు ఇంకుడు గుంతలు, ఫాం పాండ్‌లు ఉపయోగపడతాయని జడ్పీ సీఈవో నాగలక్ష్మి అన్నారు. మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ ఆవరణలో ఇంకుడు గుంతను శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ఇండ్ల వద్ద వృధాగా పోతున్న నీటిని, వర్షపు నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లిస్తే మంచిదని చెప్పారు. అడిషనల్ డీఆర్‌డీవో నల్లబోతుల రవి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో సీతారామరాజు, ఈజీఎస్ ఏపీవో రాంచంద్రరావు, పీఆర్ ఏఈ అక్షిత, పీహెచ్‌సీ డాక్టర్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ మంజూరు**

మండలంలోని నారంవారిగూడెం పంచాయతీలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్మాణానికి రూ.43లక్షలు మంజూరైనట్లు అడిషనల్ డీఆర్‌డీవో నల్లబోతుల రవి తెలిపారు. ఈ యూనిట్ నిర్మాణ స్థలాన్ని శనివారం పరిశీలించారు. వినాయకపురం గ్రామంలోని శ్రీచిలకలగండి ముత్యాలమ్మ ఆలయం వద్ద రూ.3లక్షల వ్యయంతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు తెలిపారు.

# 'ఆశ-భయం'తోనే సైబర్ నేరాలు



మాట్లాడుతున్న షీ టీం ఎస్సై రమాదేవి

ములకలపల్లి, మే 24: ఆశ-భయం.. సైబర్ నేరాలకు ఈ రెండే మూల కారణాలని షీ టీం ఎస్సై రమాదేవి చెప్పారు. మండలంలోని ములకలపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆమె శనివారం మాట్లాడారు. మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, షీ టీం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావం తదితరాంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు కొందరికి ఆశ పుట్టించి, మరికొందరిని భయపెట్టగించి నేరాలు చేస్తారని సోదాహరణగా వివరించారు. వాట్సాప్‌కు, మెయిల్స్‌కు వచ్చే అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయవద్దని, వ్యక్తిగత-బ్యాంక్ వివరాలను ఎవ్వరికీ తెలపవద్దని, ముప్పు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. మానవ తప్పిదాల కారణంగానే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలతో జీవితాలు ఎలా నాశనమవుతాయో విద్యార్థులకు వివరించాలని, వారి ప్రవర్తనను-కదలికలను నిత్యం గమనిస్తూ ఉండాలని కోరారు. మహిళలు, పిల్లలు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే షీ టీంకు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ములకలపల్లి సీఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

చుంచుపల్లి, మే 24: రుద్రంపూర్ స్కూల్‌లో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని షీ టీం ఇన్‌స్పెక్టర్ రాము శనివారం సందర్శించారు. మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం తదితరాంశాలపై మాట్లాడారు. ఎంఈవో బాలాజీ, కొత్తగూడెం టూటౌన్ ఎస్సై కిషోర్, షీ టీం ఎస్సై రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# టిప్పర్ వస్తుంది.. ప్రాణాలు తీస్తుంది..!

- **బొగ్గు టిప్పర్లు ఢీకొని ప్రాణాలు వదులుతున్న ప్రజలు**
- **రోడ్డు దాటుతున్న పశువులు సైతం మృత్యువాత**
- **ప్రమాదాలు నివారించాలని ఆందోళనలు చేపట్టినా ఫలితం శూన్యం**



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు(ఫైల్)

రామవరం, మే 24 : బొగ్గు టిప్పర్ డ్రైవర్ల అతి వేగం, అజాగ్రత్త వెరసి ప్రజల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కొందరు క్షతగ్రాతులుగా మారి ఆస్పత్రి పాలవుతున్నారు. వాహనదారులే కాకుండా మూగజీవాలు సైతం ప్రాణాలు విడుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయవాడ-జగ్దల్‌పూర్ జాతీయ రహదారి (30)పై నిత్యం నడిచే సత్తుపల్లిలోని జేవీఆర్ వోసీ, కిష్టారం ఓపెన్‌కాస్ట్ నుంచి ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు రవాణా చేసే టిప్పర్లను చూస్తేనే ప్రజలు వణికిపోతున్నారు. ఈ ప్రాంతంలో సత్తుపల్లి నుంచి రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌సీహెచ్‌పీ) ఎక్కడో ఒకచోట రోడ్డు దాటుతున్న మూగజీవాలు లారీ ఢీకొని మృతిచెందడం నిత్యకృత్యంగా మారిపోయింది. మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదం నేపథ్యంలో అధికారులు స్పందించలేదని జాతీయ రహదారిపై రాస్తారోకో కూడా చేపట్టారు. ఉదయం రాస్తారోకో చేస్తే అదేరోజు అర్ధరాత్రి మరో బొగ్గు టిప్పర్ కారును ఢీకొని తల్లీకొడుకు మృతిచెందిన విషయం విదితమే. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారుల పట్టింపు లేకపోవడం వల్లే నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.


**ఒత్తిడితోనే తరచూ ప్రమాదాలు..**

సత్తుపల్లి నుంచి ఆర్‌సీహెచ్‌పీకి రోజుకు సుమారు 70 లారీలు నాలుగు నుంచి ఐదు టిప్పుల ద్వారా బొగ్గు రవాణా చేస్తాయి. అయితే వీటిని నడిపే డ్రైవర్లకు విశ్రాంతి లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఒక్కో డ్రైవర్ 24 గంటలు పని చేయాల్సి ఉంటుంది. ఒకరోజు పనిచేస్తే మరో రోజు సెలవు ఇస్తారు. అంతేకాక నాలుగు ట్రిప్పుల తర్వాత ఐదు ట్రిప్పు వేస్తే రూ.200 చొప్పున ఇన్సెంటివ్ కూడా ఇస్తారు. ఇన్సెంటివ్ ఆశతో వాహనాలు వేగంగా నడపడం కూడా ప్రమాదాలు జరగడానికి కారణమవుతోంది. డ్రైవర్లు విశ్రాంతి లేకుండా ఒత్తిడితో నిద్రమత్తులో టిప్పర్లు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారి డ్యూటీ సమయం మార్చాలని కోరుతున్నారు.

**లోతైన పరిశోధన జరగాలి..**

లేబర్ లా ప్రకారం 8 గంటలు పని చేయాల్సి ఉంటుంది. అంతకంటే ఎక్కువ గంటలు పనిచేస్తే ఓటీ ఇవ్వాలి. అది కాకుండా కేవలం 24 గంటలు పనిచేస్తే జీతం చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్, రవాణా, కార్మిక శాఖ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు లోతైన పరిశోధన చేస్తే తప్ప భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా అరికట్టిన వారవుతారు. ప్రమాదాల విషయమై లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శంకర్‌రావును వివరణ కోరగా.. తమకు ఏ డ్రైవర్ కూడా ఫిర్యాదు చేయలేదని వాట్సాప్‌లో సమాచారం ఇచ్చారు.

# భూసేకరణ గ్రామసభను అడ్డుకున్న గిరిజనులు




సీతారామసాగర్ ప్రాజెక్టు అధికారులను అడ్డుకున్న గిరిజనులు

అశ్వారావుపేట రూరల్, మే 24: సీతారామ సాగర్ కాల్వ భూసేకరణ కోసం మండలంలోని రామన్నగూడెంలో అధికారులు శనివారం ఏర్పాటు చేసిన గ్రామ సభను అక్కడి గిరిజన రైతులు అడ్డుకున్నారు. ''ఎన్నో ఏళ్ల క్రితం.. అంకమ్మ చెరువు వరద కాల్వ నిర్మాణంలో 72 ఎకరాల భూములు కోల్పోయిన తమకు ఇప్పటివరకు నష్ట పరిహారం ఇవ్వలేదు. మళ్లీ, ఇప్పుడు సీతారామ సాగర్ కాల్వలకు భూమి ఇవ్వాలని ఎలా అడుగుతున్నారు..? దీనికి కూడా పరిహారం ఇస్తారని గ్యారంటీ ఏమిటి..?'' అని ప్రశ్నించారు. తాము గతంలో వరద కాల్వ నిర్మాణానికి ఇచ్చిన భూమిని కౌలుకు ఇస్తే ఎకరానికి రూ.30వేలు వచ్చేదని, తామే సాగు చేసుకున్నా కూడా మంచి ఆదాయం వచ్చేదని అన్నారు. ఆనాడు భూములను కోల్పోవడంతో అన్ని రకాలుగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి భూములను ఇచ్చేది లేనేలేదని తెగేసి చెప్పారు. ''మీరు గ్రామసభ నిర్వహించొద్దు. మాకు నష్ట పరిహారం సమస్యను తేల్చేదాకా మిమ్మల్ని ఇక్కడి నుంచి వెళ్లనీయం'' అంటూ, అధికారులను ముట్టడించారు. ఆ అధికారులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై యాయతిరాజు వచ్చారు. ఆ గిరిజనులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు.ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ''మిమ్మల్ని సోమవారం (26వ తేదీన) కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడిస్తాం'' అని ఎస్సై, డిప్యూటీ తహీల్దార్ హామీ ఇవ్వడంతో ఆ గిరిజనులు శాంతించారు.

## రోడ్లపై లారీలు నిలిపితే సీజ్ చేస్తాం

### డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు టౌన్, మే 24: సాండ్ రైసింగ్ కాంట్రాక్టర్లు, 14 టైర్లు, 12 టైర్లు అసోసియేషన్, కోల్ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లతో మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి డీఎస్పీ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇసుక, బొగ్గు లారీలు రోడ్లపై నిలిపి ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. లారీలను రోడ్లపై నిలిపి ఉంచితే వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని, లారీలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ బీటీపీఎస్ తిరుపతి, ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

## చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి


### భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్



మాట్లాడుతున్న భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్

దుమ్ముగూడెం, మే 24: ప్రతిఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో మండల లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు, మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించి బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలన్నారు. ఉచిత న్యాయసహాయం అందించడమే లీగల్ సర్వీసెస్ ప్రధాన లక్ష్యమన్నారు. సీఐ అశోక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, న్యాయవాదులు రావి రామ్మోహనరావు, పేరాల వెంకటేశ్వర్లు, నాగరాజు, తిరుమలరావు, సాధనపల్లి సతీష్, గౌతమ్, తరుణి, కొత్త మల్లేష్, సురేష్, రమేష్, ఉబ్బల రమేష్ పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

మణుగూరు టౌన్, మే 24: మణుగూరు మండలంలోని తోగ్గూడెం, ముత్యాలనగర్, గుట్టమల్లారం, కట్టుమల్లారం, తిర్లాపురం పంచాయతీల్లో నిర్మాణంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో విద్యాచందన పరిశీలించారు. ఈ సందర్శనలో ఎస్‌బీఎం కన్సల్టెంట్ రేవతి పాల్గొన్నారు. నిర్మాణ పనుల ప్రగతిని పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ లక్ష్యంగా చేపడుతున్న ఇంకుడు గుంతలు గ్రామీణ ప్రాంతాల్లో భవిష్యత్ తరం అవసరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి నరేష్, ఆర్ఐ, డీటీ అధికారులు, ఎంపీడీవో తేళ్లూరి శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# భర్తకు దేహశుద్ధి

అశ్వారావుపేట, మే 24: తనను, బిడ్డలను వదిలేసి వేరొక మహిళతో వివాహేతర సంబంధం సాగిస్తున్న భర్తను ఆయన భార్య కట్టేసి కొట్టింది. మండలంలోని వినాయకపురం గ్రామస్తుడు ఎస్‌కె.అబ్దుల్ హఫీజ్‌కు, చర్ల మండలానికి చెందిన ఆనీష్ ఫాతిమాతో 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హఫీజ్-ఫాతిమా దంపతులు రెండేళ్ల క్రితం మనస్పర్థలతో విడిగా ఉంటున్నారు. వినాయకపురంలోనే బంధువుల ఇంటి వద్ద ఉంటున్న భార్య ఫాతిమాపై పది రోజుల కిందట హఫీజ్ దాడి చేశాడు. అప్పటి నుంచి మరో మహిళతో వివాహేతర సంబంధం సాగిస్తున్నాడు. ఆమెతో కలిసి తన సొంత ఇంట్లోనే నివాసముంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఫాతిమా, తన ఇద్దరు బిడ్డలతో కలిసి భర్త వద్దకు శనివారం వెళ్లింది. ఆ సమయంలో ఆయనతోపాటు ఆ మహిళ కూడా ఉంది. ఈ వివాహేతర సంబంధంపై భర్తను ఫాతిమా నిలదీసింది. సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహించిన ఫాతిమా, భర్తను తాళ్లతో కట్టేసి కొట్టింది. ఈ సమాచారంతో పోలీసులు వెళ్లి, హఫీజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్వల్పంగా గాయపడిన అతడిని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ''పది రోజుల కిందట భార్యపై దాడి చేయడంతోపాటు ఆమెను ఇంటి నుంచి బయటకు గెంటేసిన ఘటనలో మొత్తం ఐదుగురిపై కేసు నమోదైంది'' అని, ఎస్సై యయాతి రాజు తెలిపారు.